పేరుకే క్రీడా ప్రాంగణాలు


నిరుపయోగంగా భీమారం క్రీడాప్రాంగణం

- గ్రామాల్లో బోర్డులకే పరిమితం
- క్రీడా సామగ్రి లేక నిరుపయోగం
- పట్టించుకోని అధికారులు

భీమారం: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వం క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేసింది. మండలంలోని 11 గ్రామ పంచాయతీల్లో 2021లో వీటిని ప్రారంభించింది. నేటికి క్రీడా సామగ్రి లేక అవి నిరుపయోగంగా మారాయి. క్రీడా ప్రాంగణాల కోసం రెవెన్యూ శాఖ ద్వారా భూములు కేటాయించింది. అధికారులు చదును చేయించి బోర్డులు ఏర్పాటు చేశారు. సదుపాయాలు కల్పించకపోవడంతో అవి ఎందుకు పనికి రాకుండా పోయాయి. బూర్గుపల్లి పంచాయతీ కార్యాలయం వెనుక చెట్ల పొదల్లో, దాంపూర్ చెరువు శిఖంలో క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేశారు. ఆ స్థలాలు ఎందుకు ఉపయోగపడవని అధికారులకు తెలిసినా ఎంపిక చేశారు.



బూర్గుపల్లిలో చెట్ల పొదల్లో బోర్డుకే పరిమితం

ఆటపరికరాలు లేవు

ప్రతి గ్రామంలో యువకులు క్రీడలపై శ్రద్ధ చూపుతున్నారు. పోలీసు, ఆర్మీ ఉద్యోగాల కోసం యువకుల సాధనకు క్రీడా ప్రాంగణాలు ఉన్నా ఆట పరికరాలు లేవు. దీంతో రోడ్లపై వాకింగ్ చేయాల్సిన పరిస్థితి. భీమారంలో జాతీయ రహదారి పక్క నుంచి కిలోమీటర్ దారి పొడవునా సాధన చేస్తున్నారు. రోడ్ల పక్కన వాకింగ్ చేస్తుండడం ప్రమాదకరంగా మారింది. పలువురు వాకర్స్ ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా స్పందించి క్రీడా ప్రాంగణాలు అందుబాటులోకి తెచ్చి క్రీడాసామగ్రి సమకూర్చాలని పలువురు కోరుతున్నారు.

అందుబాటులోకి తేవాలి


గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. వాటిని అందుబాటులోకి తేవాలి. రాష్ట్రప్రభుత్వం క్రీడా సామగ్రి ఏర్పాటు చేయాలి. పోలీసులు, ఆర్మీ ఉద్యోగాల కోసం యువకులు ప్రతిరోజు సాధన చేస్తారు. – లక్ష్మణ్, యువకుడు, ఆరెపల్లి

కార్యదర్శులతో మాట్లాడుతా


గ్రామాల్లో క్రీడా ప్రాంగణాల పరిస్థితిపై పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతాను. ఇప్పటివరకు అందులో ఏర్పాటు చేసిన సదుపాయాలు, స్పోర్ట్ కిట్లపై సమీక్షా సమావేశం నిర్వహిస్తాను. క్రీడా ప్రాంగణాలను అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటాం.
– మధుసూదన్, ఎంపీడీవో, భీమారం

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన


కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ సురేఖ

నెన్నెల: మండలంలోని మన్నెగూడంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం భీమిని డివిజన్ ఏడీఏ సురేఖ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని సూచించారు. తేమ శాతం 17 కంటే తక్కువ ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రభుత్వం సన్నరకానికి రూ.500 బోనస్ ఇస్తోందన్నారు. ఏఈవో రాంచందర్, ఈపీసీ సెంటర్ ఇన్‌చార్జి తిరుపతి, పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

జైపూర్: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించాలని జిల్లా సహకార సంఘం సీనియర్ ఇన్‌స్పెక్టర్ పుష్పలత అన్నారు. మిట్టపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. సీఈవో అర్జున్, నాయకులు శ్రీనివాస్, తరుణ్, మల్లేశ్, నరేశ్, తిరుపతి, పుష్పలత పాల్గొన్నారు.

పొన్నారంలో కొనుగోలు కేంద్రం ప్రారంభం

చెన్నూర్‌రూరల్: పొన్నారం గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అధికారులు ప్రారంభించారు. పీఏసీఎస్ సెక్రటరీ రత్న లక్ష్మీనారాయణరెడ్డి, ఏవో యామిని, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశంలో 25 తీర్మానాలు

- ఏకగ్రీవంగా ఆమోదించిన కౌన్సిల్ సభ్యులు


సమావేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్, అధికారులు

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీలో శుక్రవారం కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. చైర్‌పర్సన్ జంగం కళ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మొత్తం 25 అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. పారిశుధ్య పనుల నిర్వహణకుగాను 30 మంది సిబ్బందిని తాత్కాలిక పద్ధతిన తీసుకునేందుకు మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ.37 లక్షలు, మున్సిపాలిటీ పరిధిలో స్టామ్ వాటర్ డ్రెయినేజీ నిర్మించేందుకు అవసరమైన ప్లాన్ తయారీకి రూ.5 లక్షల ఖర్చు చేసేందుకు సభ్యులు ఆమోదం తెలిపారు. పట్టణ ప్రగతి నిధులు రూ.45 లక్షలతో విద్యుత్ దీపాల ఏర్పాటు, స్తంభాల కొనుగోలు, రూ.1.25 కోట్లతో హైడ్రాలిక్ ఆపరేటెడ్ టవర్ వ్యాగన్ వెహికల్ కొనుగోలు, రూ.70 లక్షలతో డంపింగ్ యార్డు వద్ద బోరుతోపాటు శ్మశానవాటిక వద్ద బోరు, బర్నింగ్ ప్లాట్‌ఫాం నిర్మాణానికి ఆమోదించారు. గాంధారివనంలో ఓపెన్‌జిమ్, చిల్డ్రన్స్ ప్లే ఎక్విప్‌మెంట్, నీటి సదుపాయం కోసం రూ.55 లక్షలు ఖర్చు చేసేందుకు ఆమోదం తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జి.రాజు, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, మేనేజర్ స్వామి, రెవెన్యూ అధికారి సతీశ్, ఏఈ అచ్యుత్, టీపీఎస్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల బంద్ విజయవంతం చేయండి


మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

బెల్లంపల్లిరూరల్: ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించే ప్రభుత్వ పాఠశాలల బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు దాగం శ్రీకాంత్, రెడ్డి చరణ్ కోరారు. మున్సిపాలిటీలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న ఫుడ్ పాయిజన్ ఘటనలకు నిరసనగా బంద్ నిర్వహిస్తున్నామని తెలిపారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడిలో విద్యార్థిని మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని కేటాయించకపోవడంతో విద్యావ్యవస్థ గాడితప్పిందన్నారు. సమావేశంలో ఆయా సంఘాల నాయకులు రవి, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం


ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

చెన్నూర్: చెన్నూర్ సాయిరాం ఫంక్షన్ హాల్‌లో మంచిర్యాల లయన్స్‌క్లబ్ గౌతమి ఆధ్వర్యంలో చెన్నూర్ లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నట్లు జిల్లా గవర్నర్ నడిపల్లి వెంకటేశ్వర్‌రావు తెలిపారు. అధ్యక్షుడిగా జాడి తిరుపతి, కార్యదర్శిగా గర్రెపల్లి వెంకటనర్సయ్య, కోశాధికారిగా నిమ్మల సాగర్ ఎన్నుకుని నియామక పత్రాలు అందజేశారు. లయన్స్‌క్లబ్ సభ్యులు మోదుంపురం వెంకటేశ్వర్, సుగుణాకర్‌రెడ్డి, రాజమౌళి పాల్గొన్నారు.

మాదారంలో మళ్లీ నీటి కటకట



ట్యాంకర్ నీటిని పట్టుకుంటున్న మహిళలు

తాండూర్: మండలంలోని మాదారం టౌన్‌షిప్‌లో మళ్లీ నీటి కటకట మొదలైంది. నీటి సరఫరాలో సమస్య తలెత్తడంతో సింగరేణి యాజమాన్యం కార్మికకాలనీలకు ట్యాంకుల ద్వారా నీరు సరఫరా చేస్తోంది. ఎం.వీ.కె.1 ఇంక్‌లైన్ నుంచి మాదారం ఫిల్టర్‌బెడ్‌కు సరఫరా చేసే పంప్‌సెట్ చెడిపోయి సమస్య ఏర్పడింది. దీంతో రెండురోజుల నుంచి కాలనీలో నీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తాయి. మరమ్మతు పనులు వేగవంతంగా కొనసాగకపోవడంతో కార్మిక కుటుంబాలు ఇబ్బంది పడుతున్నారు. శుక్రవారం ట్యాంకర్ సరఫరా చేసిన నీళ్లతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి. పనులు వేగంగా పూర్తయితే శనివారం నీటి సరఫరా పునరుద్ధరించే అవకాశాలున్నాయి.

జీజీహెచ్‌లో 12 మందికి వేసెక్టమీ ఆపరేషన్లు

మంచిర్యాలటౌన్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో శుక్రవారం 12 మందికి వేసెక్టమీ (కు.ని) ఆపరేషన్లను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్ తెలిపారు. కుటుంబ నియంత్రణలో భాగంగా పురుషులకు ఆపరేషన్లు చేశామని, చిన్న శస్త్రచికిత్స ద్వారా చేపట్టి, కేవలం 5 నిమిషాల్లోనే ఇంటికి వెళ్లవచ్చని డీఎంహెచ్‌వో తెలిపారు. మహిళలకు ట్యూబెక్టమీ ఆపరేషన్ల ద్వారా కు.ని చేయవచ్చునని పేర్కొన్నారు. మంచిర్యాల డిప్యూటీ డీఎంహెచ్‌వో అనిత, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కృపాబాయి, పీపీ యూనిట్ డాక్టర్ రవీంద్ర ప్రసాద్, వైద్యులు కాంతారావు, దామోదర్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

రోగులకు పండ్ల పంపిణీ

మంచిర్యాలటౌన్: దీక్షా దివస్‌లో భాగంగా మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ నాయకులు పండ్లు పంపిణీ చేసేందుకు రాగా, మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్ ఆధ్వర్యంలో నాయకులను ఆసుపత్రి నుంచి బయటకు పంపించారు.

చెన్నూర్: పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి చెన్నూర్ బీఆర్ఎస్ నాయకులు పూలమాలలు వేశారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేసుకున్నారు. మాజీ సర్పంచ్ సాధనబోయిన కృష్ణ, కౌన్సిలర్లు అనిల్, తుమ్మ రమేశ్, బీఆర్ఎస్ నాయకులు జడల మల్లేశ్, వెంకటేశ్వర్, కొప్పుల రవీందర్, నెన్నల భీమయ్య పాల్గొన్నారు.

దీక్షా దివస్‌కు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

మందమర్రిరూరల్: మంచిర్యాల జిల్లాలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన దీక్షా దివస్‌కు శుక్రవారం మందమర్రి నుంచి బీఆర్ఎస్ శ్రేణులు తరలివెళ్లారు. మార్కెట్ ఏరియాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం నాయకులు బైక్‌లపై వెళ్లారు. బీఆర్ఎస్, అనుబంధ సంఘాల నాయకులు ఉన్నారు.

నిర్మాణాత్మక సమావేశంలో సమస్యలపై చర్చ

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని జీఎం ఆఫీస్ ఆవరణలో సింగరేణి గుర్తింపు, ఏరియా ప్రాతినిధ్య సంఘం ఏఐటీయూసీ నాయకులతో శుక్రవారం యాజమాన్యం నిర్మాణాత్మక సమావేశం నిర్వహించింది. ముఖ్య అతిథిగా జీఎం దేవేందర్ హాజరై సంఘం నాయకులతో ఏరియా సమస్యలపై చర్చించారు. తన పరిధిలోని సమస్యలు పరిష్కరిస్తానని జీఎం తెలిపారు. ఏరియాలో సంస్థ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధన కోసం సహకరించాలని కోరారు. ఏరియా అధికారులు, గుర్తింపు కార్మిక సంఘం (ఏఐటీయూసీ) బ్రాంచి కార్యదర్శులు సత్యనారాయణ, దాగం మల్లేశ్, కంది శ్రీనివాస్, రాజేశం పాల్గొన్నారు.

మైనింగ్ స్టాఫ్ సంబరాలు


మిఠాయి తినిపించుకుంటున్న నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణిలో మైనింగ్ స్టాఫ్‌కు అన్‌ఫిట్ అయితే సూటబుల్ జాబ్ ఇచ్చేలా గుర్తింపు సంఘం ఏఐటీయూసీ గురువారం జరిగిన స్ట్రక్చర్ సమావేశంలో ఒప్పందం చేసుకోవడంపై మైనింగ్ స్టాఫ్ నాయకులు హర్షం వ్యక్తంచేశారు. శుక్రవారం ఎస్సార్పీ 3, 3ఏ, ఎస్సార్పీ 1 గనులపై మైనింగ్ స్టాఫ్ మిఠాయిలు పంచుకొని సంబురాలు జరుపుకున్నారు. ఏఐటీయూసీ బ్రాంచీ సెక్రెటరీ ఎస్కే బాజీసైదా మాట్లాడుతూ మైనింగ్ స్టాఫ్ సోదరులు చాలాకాలంగా సూటబుల్ జాబ్ కోసం పోరాడుతున్నారని, ఎట్టకేలకు నేడు నెరవేరిందన్నారు. బంగ్లా కీప్ అప్ అలవెన్సు, చార్జీ అలవెన్సులపై వచ్చేనెలలో జరిగే సీఎండీ లెవల్ స్ట్రక్చర్ సమావేశంలో చర్చించి పరిష్కరిస్తామన్నారు. మైనింగ్ స్టాఫ్ రీజియన్ సెక్రెటరీ వంగరి రాజేశ్వర్‌రావు, బ్రాంచి సెక్రెటరీ మోతుకూరి కొమురయ్య, మైనింగ్ స్టాఫ్ సబ్‌కమిటీ ఉపాధ్యక్షుడు బాలకృష్ణ, ఎస్సార్పీ 3, 3ఏ గని ఫిట్ సెక్రెటరీ మురళీచౌదరి, నాయకులు గొర్రె నర్సయ్య, అడ్డూరి శ్రీనివాస్, క్రాంతి కిరణ్, నరేశ్, శివకుమార్ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

భీమిని: ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి అనిత అన్నారు. కన్నెపల్లి రైతు వేదికలో శుక్రవారం రైతులకు ఆయిల్‌పామ్ సాగు, యాజమాన్య పద్ధతులపై అధికారులు అవగాహన కల్పించారు. ఆయిల్‌పామ్ సాగుకు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డివిజన్ ఉద్యానవశాఖ అధికారి అరుణ్, మ్యాట్రిక్స్ కంపెనీ సీఈవో ఉదయ్‌కుమార్, ఏవో సాయిప్రశాంత్, ఏఈవోలు సంతోష్, విజయ్, అలేఖ్య, రైతులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడాలి


మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ(అడ్మిన్) సి.రాజు

బెల్లంపల్లిరూరల్: శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు అహర్నిశలు పాటుపడాలని అడిషనల్ డీసీపీ(అడ్మిన్) సి.రాజు అన్నారు. శుక్రవారం బెల్లంపల్లిలోని ఏఆర్ హెడ్ క్వాటర్స్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. వివిధ విభాగాలు, రికార్డులు పరిశీలించారు. సిబ్బంది సమస్యలు తెలుసుకుని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏసీపీ సుందర్‌రావు, ఆర్ఐ వామనమూర్తి, ఆర్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

కనుల పండువగా దీపోత్సవం


పాల్గొన్న జీఎం దంపతులు

మందమర్రిరూరల్: మందమర్రిలోని మూడో జోన్‌లోని శ్రీ సీతారామచంద్రస్వామి, కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయాల ప్రాంగణంలో శుక్రవారం కార్తిక దీపోత్సవం కనుల పండువగా జరిగింది. సాయంత్రం మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, కార్తిక దీపోత్సవం, పార్వతీ పరమేశ్వరుల కల్యాణాన్ని అర్చకుడు వెంకటాచార్యులు జరిపించారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, ఏరియా జీఎం దేవేందర్ దంపతులు, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి సత్యనారాయణ, కేకే–5 గని సంక్షేమాధికారి కార్తీక్, రక్షణ అధికారి రమేశ్ దంపతులు ఉన్నారు.

మైసమ్మ ఆలయంలో పూజలు

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట–1 గని వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మైసమ్మ ఆలయంలో శుక్రవారం పూజలు నిర్వహించారు. మందమర్రి జీఎం దేవేందర్ హాజరై పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోమం నిర్వహించి అన్నదానాలు చేపట్టారు. అనంతరం జీఎం దంపతులను సన్మానించారు. ఏజెంట్ రాందాస్, ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, బ్రాంచి ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, గని మేనేజర్ భూశంకరయ్య, సంక్షేమాధికారి జీషాన్, రక్షణాధికారి నికిల్ అయ్యర్, అధికారులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

కోటపల్లి: సమగ్రశిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న సీఆర్పీలు, పీటీఐలు, ఎంఐఎస్, సీసీవోలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ మండల విద్యావనరుల కేంద్రంలో సిబ్బంది శుక్రవారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. సీఆర్పీలు సంపత్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

వైద్యశిబిరం

కోటపల్లి: కోటపల్లి సమీపంలోని నీలగిరి ప్లాంటేషన్‌లో వలస కార్మికుల కోసం వైద్యారోగ్యశాఖ, టీజీఎఫ్‌డీసీ సంయుక్తంగా శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. కోటపల్లి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ అరుణశ్రీ, వైద్యులు వారికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్మికుల ఆరోగ్యం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మంచిర్యాల రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ గోగు సురేశ్‌కుమార్ తెలిపారు.

సన్మానం

చెన్నూర్: ఇటీవల జూనియర్ లెక్చరర్‌గా ఎంపికైన చెన్నూర్ బేతాళవాడకు చెందిన గడ్డం మౌనికను చెన్నూర్ వికాస తరంగిణి కోర్డినేటర్ కట్ల శ్రీనివాసాచార్యుల సన్మానించారు. మౌనిక తల్లిదండ్రులు శ్రీవాణి–గోపాల్, సభ్యులు పాల్గొన్నారు.

సంజీవ్ సంస్మరణ సభకు తరలిరావాలి

కోటపల్లి: ఉట్నూర్‌లోని కుమురం భీం కాంప్లెక్స్‌లో డిసెంబర్ 1న జరిగే ఆదివాసీ ఉద్యమ నేత ఉయిక సంజీవ్ సంస్మరణ సభకు ఆదివాసీలు తరలిరావాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు జేక శేఖర్ కోరారు. తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు బండి రమేశ్, కోశాధికారి వెంకటేశ్, నాయకులు మాంతయ్య, విజయ్, అశోక్ పాల్గొన్నారు.

మాలల సింహగర్జన విజయవంతం చేయాలి

లక్సెట్టిపేట: సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో డిసెంబర్1న నిర్వహించే మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని నాయకులు కోరారు. శుక్రవారం స్థానిక ఐబీ ఆవరణలో సింహగర్జన సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. గరిసె రవీందర్, శాంతికుమార్, రవి పాల్గొన్నారు.

'రమేశ్ అరెస్టును ఖండిస్తున్నాం'

పాతమంచిర్యాల: భద్రాద్రి జిల్లా కొత్తగూడెం సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి పూనెం రమేశ్ అరెస్టును ఖండిస్తున్నామని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు టీ.శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి లాల్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన్ను వెంటనే కోర్టులో హాజరుపర్చాలని డిమాండ్ చేశారు.

సర్వే డాటా ఎంట్రీ పరిశీలన

భీమారం: మండల పరిషత్ కార్యాలయంలో సమగ్ర ఇంటింటా సర్వే డేటా ఎంట్రీని ఎంపీడీవో మధుసూదన్ శుక్రవారం పరిశీలించారు. ఎంపీవో సతీశ్‌రెడ్డి, జీపీ కార్యదర్శి కృష్ణమూర్తి ఉన్నారు.

ఇళ్ల స్థలాలు కబ్జా కాకుండా కాపాడాలి

బెల్లంపల్లిరూరల్: పట్టణంలోని 2వ వార్డు గ్రౌండ్ బస్తీవాసులకు కేటాయించిన ఇందిరమ్మ ఇళ్ల స్థలాలను కొందరు కబ్జాకు యత్నిస్తున్నారని వారి నుంచి కాపాడాలని బస్తీ వాసులు చింతపండు సరోజ, తావి శ్రీనివాస్, ఒడ్నాల పద్మ, సయ్యద్ మహెబూబ్ కోరారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. 2011–12 సంవత్సరంలో రచ్చబండలో భాగంగా ప్రభుత్వం తమకు ఇందిరమ్మ ఇళ్ల స్థలాలు కేటాయించిందన్నారు. దాసరి కమల, అరుణ, కౌన్సిలర్ అండదండతో కబ్జాచేశారని తెలిపారు. దీనిపై తహసీల్దార్, ఆర్డీవో, మంచిర్యాల డీసీపీ, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్

జన్నారం: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మురిమడుగు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని శుక్రవారం పరిశీలించారు. వంట గది, పరిసరాలను శుభ్రంగా ఉండేలా చూడాలని సిబ్బందికి సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట ఎంఈవో విజయ్‌కుమార్, హెచ్ఎం అజయ్‌కుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

క్లుప్తంగా

విద్యార్థుల్లో పఠన సామర్థ్యం పెంచాలి


మోడల్ లైబ్రరీని ప్రారంభిస్తున్న ఎంఈవో

నెన్నెల: విద్యార్థుల్లో పఠన సామర్థ్యం పెంపొందించడమే లక్ష్యమని ఎంఈవో చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మైలారం ప్రాథమిక పాఠశాలలో రూమ్ టూ రీడ్ ఇండియా ట్రస్ట్ యూఎస్ఏఐడీ సహకారం, ఎస్ఈఆర్ఐ, ఎఫ్ఎల్ఎన్‌కు అనుబంధంగా విద్యాశాఖ సమన్వయంతో శుక్రవారం మోడల్ లైబ్రరీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదవడం, రాయడం వల్ల విషయపరిజ్ఞానం పెరుగుతుందన్నారు. రూమ్ టూ రీడ్ ఇండియా ట్రస్ట్ ప్రతి మండలానికి మోడల్ లైబ్రరీని ఏర్పాటు చేస్తుందన్నారు. లైబ్రెరిలో వివిధ రకాల కథలతో కూడిన పుస్తకాలు, పిల్లల ఆలోచన పరిధిని పెంచుతాయన్నారు. రూమ్ టూ డిస్ట్రిక్ట్ లీడ్ మధు, పాఠశాల హెచ్ఎం దామోదర్, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌చారి, సీఆర్పీలు దుర్గం రాజేశ్ పాల్గొన్నారు.

జాతీయ మహాసభల కరపత్రం ఆవిష్కరణ


ఆవిష్కరిస్తున్న డీహెచ్‌పీఎస్ నాయకులు

చెన్నూర్: చెన్నూర్ సీపీఐ కార్యాలయంలో అఖిల భారత దళిత హక్కుల ఉద్యమ జాతీయ మహాసభల కరపత్రాలను డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవి పోచన్న శుక్రవారం ఆవిష్కరించారు. వచ్చే ఏడాది జనవరి 5,6,7 తేదీల్లో నిర్వహించే ఈ మహాసభలను విజయంతం చేయాలని కోరారు. సీపీఐ మండల కార్యదర్శి నెన్నల సమ్మయ్య, నాయకులు బడికల మధునయ్య, దుర్గం శంకర్, గజ్జెల తిరుపతి, మొగిలి లక్ష్మణ్, శ్రీనివాస్, నారాయణ, ప్రశాంత్, ఎనగందుల శంకర్, చందు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ


ఎంపీడీవోను సన్మానిస్తున్న బీజేపీ నేతలు

కోటపల్లి: కోటపల్లి ఎంపీడీవోగా లక్ష్మయ్య శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు పురుషోత్తం ఆధ్వర్యంలో ఆయన్ను సన్మానించారు. మండల అధ్యక్షుడు మంత్రి రామయ్య, ఉపాధ్యక్షుడు పెద్దింటి పున్నంచంద్, జనరల్ సెక్రటరీ లక్ష్మణ్ ఉన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

బెల్లంపల్లిరూరల్: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని బెల్లంపల్లి ఎక్సైజ్ సీఐ ఇంద్రప్రసాద్, ఎన్.హెచ్.వై.కె ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కోఆర్డినేటర్ మజీద్ అన్నారు. శుక్రవారం బెల్లంపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వినియోగాల వల్ల కలిగే అనార్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడి తమ జీవితాలను అంధకారం చేసుకోవద్దన్నా రు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకుని ముందుకెళ్లాలన్నారు. అనంతరం ప లువురిని సన్మానించారు. ప్రభుత్వ డిగ్రీ కళా శాల అసిస్టెంట్ ప్రొఫెసర్ గజెల్లి మోహన్, ఎక్సైజ్ ఎస్సై శారద, కళాశాల ప్రిన్సిపాల్ అంజ య్య, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎడ్ల సోమయ్య, అధ్యాపకులు కృష్ణవేణి, గురుపాదం, చంద్రయ్య, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజాపాలన విజయోత్సవాలు

పాతమంచిర్యాల: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఈ నెల 30న మంచిర్యాలలోని పద్మనాయక కల్యాణమండపంలో హైదరాబాద్‌కు చెందిన కళాకారులతో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై గ్రామాలు, మండలాలు, మున్సిపాలిటీల్లో కళాయాత్రలు నిర్వహిస్తామని తెలిపారు.

రైతు పండగ

పాతమంచిర్యాల: జిల్లాలో ఈ నెల 30న రైతు పండగ కార్యక్రమాన్ని రైతులు, అధికారులు విజయవంతం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి కల్పన ఒక ప్రకటనలో తెలిపారు. రైతువేదికల్లో ఆయా క్లస్టర్ల రైతులు, అధికారులు హాజరై సీఎం ప్రసంగంవినాలని తెలిపారు. జిల్లాలోని 55 క్లస్టర్లలో వేడుకల ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు.